విద్యార్థుల హాజరు అంతంతే..

- కొన్ని పాఠశాలల్లో ఇష్టారీతిన అటెండెన్స్ నమోదు
- దీపావళి పండుగకు వెళ్లారంటున్న అధికారులు
- కొరవడిన ఉన్నతాధికారుల పర్యవేక్షణ



ప్రార్థన చేస్తున్న విద్యార్థులు

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ డివిజన్ పరిధిలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పూర్తిస్థాయిలో విద్యార్థులు హాజరు కావడం లేదు. దసరా సెలవుల అనంతరం పాఠశాలలు పునఃప్రారంభమై 21 రోజులు గడుస్తున్నా.. ఇప్పటికీ పూర్తిస్థాయిలో విద్యార్థులు హాజరు కాలేదు. దీంతో విద్యార్థులు నష్టపోవాల్సి వస్తోంది. ఆదిలాబాద్ డివిజన్ పరిధిలో 14 గిరిజన ఆశ్రమ పాఠశాలలు ఉండగా.. అందులో 6 బాలికలు, 8 బాలుర వసతి గృహాలున్నాయి.

పాఠశాలలకు చేరుకోని పూర్తిస్థాయి విద్యార్థులు

దసరా సెలవు తర్వాత పాఠశాలలు పునఃప్రారంభమై 21 రోజులు గడుస్తున్నా ఇప్పటికీ పూర్తిస్థాయిలో విద్యార్థులు వసతి గృహాలకు చేరుకోలేదు. డివిజన్ పరిధిలో 14 ఆశ్రమ పాఠశాలలు ఉండగా.. 3668 మంది విద్యార్థులు ఆయా వసతిగృహాల్లో ఉంటూ చదువుకుంటున్నారు. ఇప్పటివరకు కేవలం 665 మంది విద్యార్థులు మాత్రమే హాజరు కాగా, ఇంకా 3003 మంది విద్యార్థులు హాజరు కావడం లేదు.

అధికంగా అటెండెన్స్ నమోదు..

పూర్తిస్థాయిలో విద్యార్థులు వసతి గృహాలకు హాజరు కాకపోవడంతో డివిజన్ పరిధిలోని కొన్ని ఆశ్రమ పాఠశాలలకు చెందిన హెచ్‌ఎం, వార్డెన్‌లు అధికంగా అటెండెన్స్ వేసి విద్యార్థులు పాఠశాలలో ఉన్నట్లు చూపుతున్నారనే విమర్శలు ఉన్నాయి. డివిజన్ పరిధిలోని ఓ ఆశ్రమ పాఠశాలకు 20 మంది విద్యార్థులు బుధవారం హాజరైతే 127 మంది విద్యార్థులు హాజరైనట్లు అధికారులకు చెప్పినట్లు తెలిసింది. అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో ఉపాధ్యాయులు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. వసతి గృహాల హెచ్‌ఎం, వార్డెన్‌లు అధికంగా అటెండెన్స్ నమోదు చేసి చూపిస్తున్నారు.

> **చర్యలు తీసుకుంటాం**
>
> దసరా సెలవుల అనంతరం విద్యార్థులు వసతి గృహానికి వచ్చి అనంతరం దీపావళి పండుగకు వెళ్లారు. వసతి గృహానికి రాకున్న అటెండెన్స్ ఎక్కువగా నమోదు చేసినట్లు మా దృష్టికి రాలేదు. అలా చేస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటాం.
>
> – నిహారిక, ఏటీడీవో, ఆదిలాబాద్

క్లుప్తంగా

సర్వసభ్య సమావేశం వాయిదా



వాయిదా వేస్తున్నట్లు ప్రకటిస్తున్న ఎంపీపీ మంజుల

తాంసి: మండల కేంద్రంలో నిర్వహించే సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా పడింది. ఉదయం 11 గంటలకు నిర్వహించాల్సిన సమావేశానికి 12 గంటలు దాటిన సభ్యులు హాజరు కాకపోవడంతో వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీవో భూమయ్య తెలిపారు. సమావేశాన్ని నిర్వహించే తేదీని త్వరలో ప్రకటిస్తామన్నారు.

కంది శ్రీనివాస్ క్షమాపణ చెప్పాలి



మాట్లాడుతున్న బీసీ సంఘం నాయకులు

తాంసి: బీసీ మహిళా గంద్రత్ సుజాతపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఆదిలాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి కంది శ్రీనివాస్ రెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలని తాంసి, భీంపూర్ మండలాలకు చెందిన బీసీ నాయకులు హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంలో సమావేశం నిర్వహించారు. అనిల్ మాట్లాడుతూ.. ఒక మహిళా నాయకురాలిపై వ్యక్తిగత ఆరోపణలు చేయడం సరికాదన్నారు. సమావేశంలో నాయకులు మహేందర్, రాజేశ్, భగువాండ్లు, సదానంద్, అరుణ్, వెంకన్న, దేవేందర్ పాల్గొన్నారు.

ట్రాక్టర్ పరికరాలు చోరీ

ఇంద్రవెల్లి: మండలంలోని ఏమాయికుంట గ్రామ పంచాయతీ ట్రాక్టర్ సెల్ఫ్ మోటర్, బ్యాటరీని గుర్తుతెలియని వ్యక్తులు దొంగలించినట్లు పంచాయతీ కార్యదర్శి సత్యానారాయణ బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట పార్కింగ్ చేసి ఉంచిన ట్రాక్టర్ పరికరాలను దొంగిలించినట్లు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు ఎస్సై తెలిపారు.

సన్మానం

తాంసి: భీంపూర్ మండలంలోని నిపాని గ్రామానికి చెందిన యువకుడు గోల్డ్‌మెడల్ సాధించడంతో గ్రామస్తులు బుధవారం సన్మానించారు. నడిమెట్ల అవినాష్ మహాత్మాగాంధీ యునివర్సిటీ ఎంఏ ఎకనామిక్స్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచి, నాలుగు రోజుల క్రితం యూనివర్సిటీ స్నాతకోత్సవంలో గవర్నర్ తమిళిసై చేతుల మీదుగా గోల్డ్‌మెడల్ అందుకున్నాడు. దీంతో గ్రామస్తులు యువకుడిని సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజన్న, ఉప సర్పంచ్ ప్రణీత్‌రెడ్డి, అనిల్, రాజు, సంతోష్, వినోద్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కళోత్సవంలో జిల్లా నృత్యకారిణి



అక్షర

ఆదిలాబాద్: హైదరాబాద్‌లోని మాదాపూర్ సీసీఆర్టీలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి కళా ఉత్సవంలో జిల్లా కేంద్రానికి చెందిన అక్షర తన నృత్యాన్ని ప్రదర్శించింది. పట్టణంలోని బాల కేంద్రంలో కూచిపూడి నృత్యంలో శిక్షణ పొందుతున్న అక్షర ఆనందతాండవ గీతంపై నృత్యం చేసినట్లు బాలకేంద్రం పర్యవేక్షకుడు మిట్టు రవి తెలిపారు.

పూల సాగుతో ఉపాధి



బంతి పూలు సాగు చేస్తున్న యువరైతు జాదవ్ మాధవ్

ఇచ్చోడ: మండలంలోని అడేగామ(బి) గ్రామానికి చెందిన జాదవ్ మాధవ్ ఏడాది పొడవునా.. వివిధ రకాల పూల సాగు చేస్తూ.. అధిక లాభాలు అర్జిస్తున్నాడు. దసరా, దీపావళి సమయంలో వీటికి గిరాకీ అధికంగా ఉండడంతో ఆ సమయానికి పంట చేతికి వచ్చే మేలైన రకాలను ఎంపిక చేసుకుని రెండు ఎకరాల్లో పసుపు, ఎరుపు రంగుల బంతి పూలను సాగు చేస్తున్నాడు. మహారాష్ట్రలోని పూనే జిల్లా నుంచి బంతిపూల మొక్కలను దిగుమతి చేసుకొని, నాటాడు. నాటిన మొక్కలకు బిందుసేద్యం ద్వారా నీటిని, ఎరువులు అందిస్తున్నాడు. పూలసాగుకు దాదాపుగా రూ. 30 వేల రూపాయల మొక్కల కోసం వెచ్చించారు. పెళ్లిలు, శుభాకార్యాలయాలకు సైతం పూలు విక్రయిస్తున్నాడు. ఆదిలాబాద్, నిర్మల్ పట్టణలకు ప్రతిరోజు క్వింటల్ పూలను వ్యాపారులకు విక్రయించి లాభాలు పొందుతున్నాడు.

కాంగ్రెస్‌లో చేరిన బీఎస్పీ అభ్యర్థి

కైలాస్‌నగర్: బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన ఉయిక ఇందిరా ఆ పార్టీని వీడారు. బుధవారం కాంగ్రెస్‌లో చేరారు. తన నామినేషన్‌ను ఉపసంహరించుకున్న ఆమె కాంగ్రెస్ సీనియర్ నాయకులు డీసీసీబీ డైరెక్టర్ బాలూరి గోవర్ధన్ రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. ఆమెకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

అభివృద్ధి, సంక్షేమం అభూతకల్పనే

ఎదులాపురం: బీఆర్ఎస్ నేతలు చెబుతున్న అభివృద్ధి. సంక్షేమం అభూత కల్పనేనని డీసీసీబీ డైరెక్టర్ బాలూరి గోవర్ధన్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం మాట్లాడారు. సీఎం కేసీఆర్ రైతుబీమా పేరుతో రైతాంగాన్ని మోసం చేస్తున్నారని, రుణమాఫీ పేరుతో నయవంచన చేశారని ఆరోపించారు. కోర్టా, చనాఖా ప్రాజెక్టు ద్వారా ఎకరం భూమిని కూడా తడపలేదన్నారు. ఎత్తిపోతల పథకాన్ని ట్రయల్ రన్ చేసి గొప్పలకు పోవడం బీఆర్ఎస్ పని తీరుకు నిదర్శనమని విమర్శించారు.

వర్గీకరణ బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలి



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

తలమడుగు: శీతకాలం పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు గొంటిముక్కల ప్రేమేందర్ అన్నారు. బుధవారం మండలంలోని ఖోడద్ గ్రామంలో మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ప్రధాని నరేంద్రమోదీ ఎస్సీ వర్గీకరణ బిల్లు చేస్తామని, మాదిగ జాతికి అండగా నిలుస్తామని హామీ ఇవ్వడం జరిగిందని గుర్తుచేశారు. కార్యక్రమంలో సుద్దాల శివ కుమార్, మంత్రి స్వామి, అశోక్, కడదరపు ప్రవీణ్, సుంకే రమేశ్, గొంటిముక్కల గోపి, గంగన్న, బాపన్న, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణం ఏర్పాటు చేయొద్దు



వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

సిరికొండ: మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న మద్యం దుకాణాన్ని జనవాసాలకు దూరంగా ఏర్పాటు చేయాలని ప్రజలు తహసీల్దార్ విజయ్ కుమార్, గ్రామ పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. గ్రామ మొదటి వార్డు సమీపంలో ఏర్పాటు చేస్తున్నారని, ఇక్కడ ఏర్పాటు చేస్తే మహిళలు, విద్యార్థులు ఇబ్బంది పడుతారని తెలిపారు. మద్యం దుకాణానికి అనుమతి ఇవ్వొద్దని కోరారు.

'దళితుల మధ్య చిచ్చుపెట్టొద్దు'



మాట్లాడుతున్న నాయకులు

ఖానాపూర్: కలిసిమెలిసి ఉంటున్న దళితుల మధ్య కేంద్రప్రభుత్వం చిచ్చుపెట్టి ఎస్సీ వర్గీకరణ చేయెద్దని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దాసరి రాజన్న, జిల్లా కన్వీనర్ నత్యేం శ్యామ్ అన్నారు. బుధవారం పట్టణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వర్గీకరణ చేస్తే కర్ణాటకలో బీజేపీకి పట్టిన గతే తెలంగాణలోనూ పడుతుందని పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణకు మద్దతు తెలిపే రాజకీయ పార్టీలకు మాలలంతా కలిసి గుణపాఠం చెబుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బేర తిరుమలేశ్, లక్ష్మినర్సయ్య తదితరులున్నారు.

కేజీబీవీలో ఉపన్యాస పోటీలు

తానూరు: మండల కేంద్రంలోని కుస్తూర్బా గాంధీ బాలి కల విద్యాలయంలో మ ండలంలోని ప్రభుత్వ ఉ న్నత పాఠశాలల విద్యార్థులకు బుధవారం సోషల్ ఫోరం ఆధ్వర్యంలో ఉపన్యాస పోటీలు నిర్వహించారు. పోటీల్లో ఎల్వి జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థిని బి.సంధ్యారాణి ప్రతిభ కనబర్చి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు నరేందర్ తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అలేఖ్య, ఉపాధ్యాయులు భూమన్న యాదవ్, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

బూటకపు హామీలు నమ్మవద్దు

- ఆదిలాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి జోగు రామన్న



పార్టీలో చేరిన వారిలో ఎమ్మెల్యే జోగు రామన్న

ఆదిలాబాద్‌టౌన్: కాంగ్రెస్, బీజేపీల బూటకపు హామీలను నమ్మవద్దని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జైనథ్ మండలం పిప్పర్‌వాడ బీజేపీ వార్డు సభ్యులు, పద్మశాలి సంఘం మండల ప్రధాన కార్యదర్శి మోరే శ్రీనివాస్‌తో పాటు బీజేపీ, కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. ఈసందర్భంగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నల్లధనం వాపసు తీసుకువస్తామని హామీ ఇచ్చిన కేంద్రం ఇప్పటికీ ఆ హామీని నెరవేర్చలేదని మండిపడ్డారు. ఉచితంగా గ్యాస్ ఇస్తామని చెప్పి రూ.1200లకు పెంచిందన్నారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ప్రభుత్వ పనితీరును చూసే వేలాది మంది యువకులు పార్టీలో స్వచ్ఛందంగా చేరుతున్నారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో అభివృద్ధి మంత్రం జపిస్తున్న కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజాని, పట్టణ అధ్యక్షుడు అజయ్, జిట్ట రమేశ్, బొమ్మకంటి రమేశ్, యూనుస్ అక్బాని, వెనుగంటి ప్రకాష్, మెట్టు ప్రహ్లాద్, ఫెరోజ్, పర్వీన్ సుల్తానా, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే అన్నివర్గాలకు న్యాయం

- బోథ్ బీఆర్ఎస్ అభ్యర్థి అనిల్‌జాదవ్



మాట్లాడుతున్న అనిల్ జాదవ్



పార్టీలోకి ఆహ్వానిస్తున్న అనిల్‌జాదవ్

నేరడిగొండ: బీఆర్ఎస్‌తోనే అన్నివర్గాలకు న్యాయం జరుగుతుందని బీఆర్ఎస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి గొడం నగేశ్, బీఆర్ఎస్ బోథ్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో నేరడిగొండ, ఇచ్చోడ మండలాల నుంచి కాంగ్రెస్, బీజేపీ నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్ సర్కారు చేసిన అభివృద్ధిని చూసి ప్రతిపక్షాలు ఓర్వలేక పోతున్నాయని విమర్శించారు. బోథ్ జెడ్పీటీసీ సంధ్యరాణి, ఎంపీపీ రాథోడ్ సజన్, అల్లూరి శివారెడ్డి, పెంట వెంకట రమణ, అంబేకర్ పండరి పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక

సిరికొండ: బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ అన్నారు. బుధవారం కొండపూర్‌లో పలువురు యువకులు బీఆర్ఎస్‌లో చేరారు. ఖానాపూర్ నియోజకవర్గ అభివృద్ధికి జాన్సన్‌నాయక్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. అలాగే మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు కంచం లక్ష్మణ్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్ సమక్షంలో బుధవారం బీఆర్ఎస్‌లో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పైడిపల్లి రవీందర్, చౌహాన్ భరత్, పుష్పరాణి, పుర్క బాపురావు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

ఆశీర్వదించండి.. అభివృద్ధి చేస్తా

- బోథ్ బీజేపీ అభ్యర్థి 'సోయం'



ప్రచారం చేస్తున్న సోయం బాపూరావు

బోథ్: ఎమ్మెల్యేగా ఆశీర్వదిస్తే బోథ్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని బోథ్ బీజేపీ అభ్యర్థి సోయం బాపూరావు అన్నారు. బుధవారం మండలంలోని చింతల్‌బోరిలో గ్రామంలో ఎన్నికల ప్రచారం చేశారు. మహిళలు మంగళహారతులతో ఘన స్వాగతం పలికారు. బీజేపీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రైల్వేబోర్డు సభ్యులు జివి.రమణ, మండల కన్వీనర్ సుభాష్, సూర్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌ను చిత్తుగా ఓడించాలి

తలమడుగు: బీఆర్ఎస్‌ను చిత్తుగా ఓడించాలని బోథ్ బీజేపీ అభ్యర్థి, సోయం బాపూరావు అన్నారు. బుధవారం మండలంలోని లింగి, కుచులాపూర్, పల్సి(కె), పల్సి(బి), దేహగామ, కోసాయి, కప్పర్‌దేవి, ఝరి, పూనగుడ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ తొమ్మిదిన్నర ఏళ్లలో ఎలాంటి అభివృద్ధి చేయలేదన్నారు. మళ్లీ కారుగుర్తుకు ఓటు వేసి మోసపోవద్దన్నారు. కార్యక్రమంలో నాయకులు చిలుకూరి జ్యోతిరెడ్డి, నల్ల రత్నాకర్ రెడ్డి, రమణ, స్వామి, సంతోష్‌రెడ్డి, స్వామి, నక్క ధనంజయ పాల్గొన్నారు.

బీజేపీతోనే గ్రామాల అభివృద్ధి

తాంసి: గ్రామాల అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి సాకటి దశరథ్ అన్నారు. బుధవారం బీజేపీ అభ్యర్థి సోయం బాపురావుకు మద్దతుగా భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటి గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు బీజేపీలో చేరగా.. కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు రాకేశ్, అశోక్, దేవారెడ్డి, నర్సింగ్, కూకటి వెంకటేశ్, పాండ్‌రంగ్, హన్మండ్లు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హయాంలోనే పేదలకు సంక్షేమ పథకాలు

- ఖానాపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్య జాన్సన్‌నాయక్



ఖానాపూర్‌లో మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్‌నాయక్

ఖానాపూర్: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్య జాన్సన్‌నాయక్ అన్నారు. బుధవారం పట్టణంలోని 7, 8 వార్డుల పరిధిలో పలువురు ముస్లింలు మాజీ ఎంపీటీసీ జమీల్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. తనపై కొందరు చేస్తున్న దుష్ప్రచారం నమ్మవద్దని ప్రజలను కోరారు. ఖానాపూర్ మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. కేసీఆర్ అధికారంలోకి వచ్చాకే షాదీ ముబారక్‌తోపాటు, మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలు, మైనార్టీలకు రుణాలు అందించారన్నారు. రాజేందర్, ఖలీల్, రామునాయక్, సురేశ్, రాజన్న, శ్రీనివాస్ తదితరులున్నారు.

ఖానాపూర్: నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎమ్మెల్యేగా ఖానాపూర్ బీఆర్ఎస్ అభ్యర్థి జాన్సన్‌నాయక్ గెలిపించాలని ఆ పార్టీ నాయకులు బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టణంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. బుధవారం మండలంలోని ముత్నూర్, దుబ్బగూడ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్యా జాన్సన్‌నాయక్‌ను గెలిపించాలని కోరారు. షేక్ సుఫీయన్, డోంగ్రే గణేశ్, పద్వాల్ గోపాల్‌సింగ్, మెస్రం తుకారం, కోవ రాజేశ్వర్, కనక హన్మంత్‌రావు పాల్గొన్నారు.

బజ్జీలు అమ్మిన జెడ్పీ చైర్మన్

ఉట్నూర్‌రూరల్: ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం జెడ్పీచైర్మన్ జనార్దన్ రాథోడ్ ఉట్నూర్ పట్టణంలో ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్ నాయక్‌ని గెలిపించాలని ప్రజలను కోరారు. దుకాణంలో బజ్జీలు వేశారు. ధరణి రాజేశ్, వాసు పాల్గొన్నారు.

మాక్‌పోలింగ్



అవగాహన కల్పిస్తున్న ప్రధానోపాధ్యాయురాలు

తలమడుగు: విద్యార్థి దశ నుంచే ఓటు ప్రాధాన్యత తెలుసుకోవాలని ప్రధానోపాధ్యాయులు ప్రత్యూష అన్నారు. మండలంలోని భరంపూర్ ఉన్నత పాఠశాలలో బుధవారం మాక్‌పోలింగ్ నిర్వహించారు. అనంతరం ఓటు ప్రాధాన్యత గురించి వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మినారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పోలీసుల ఫ్లాగ్‌మార్చ్

భైంసారూరల్: మండలంలోని దేగాం, కామోల్ గ్రామాల్లో బుధవారం స్థానిక పోలీసులు కేంద్ర బలగాలతో కలిసి ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా భైంసారూరల్ సీఐ నైలు మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా సమస్యాత్మక గ్రామాల్లో ప్రజలకు భరోసా కల్పించేందుకే ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల్లో అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలు ఎన్నికల అధికారులకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై శ్రీకాంత్, బీఎస్ఎఫ్ బలగాలు, పోలీసులు ఉన్నారు.

రక్తదానం

ఎదులాపురం: ఉట్నూర్‌కు చెందిన వరలక్ష్మి అనే మహిళకు ఓ పాజిటీవ్ రక్తం అవసరం కావడంతో కుటుంబీకులు రిమ్స్ బ్లడ్ బ్యాంకును సంప్రదించారు. రిమ్స్ బ్లడ్ సెంటర్ టెక్నిషియన్ సూర్యనారాయణ తల్లిపిలుపు కాల్ సెంటర్, డీఎంహెచ్‌వో ఆఫీస్‌కు కాల్ చేయగా... అక్కడే విధులు నిర్వహిస్తున్న ఆర్‌బీఎస్‌కే కన్సల్టెంట్ చేతన్ కుమార్ విషయం తెలుసుకుని రిమ్స్‌కు వచ్చి రక్తదానం చేశారు.

పాఠశాలల తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న నర్సయ్య

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని అంకోలి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు, సీఆర్పీ కంటి నర్సయ్య ఎంపీయూపీఎస్ లోకారి, పిప్పల్‌ధరి, అంకోలి ప్రాథమిక పాఠశాలలను బుధవారం సందర్శించారు. ఉపాధ్యాయుల టీచింగ్ డైరీ, విద్యార్థుల వర్క్‌బుక్‌లను పరిశీలించారు. ఎఫ్‌ఆర్ఎస్ హాజరు, యూడైస్ ఉన్న విద్యార్థుల సంఖ్యపై ఆరా తీశారు. ఆయన వెంట ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉన్నారు.